ఆ... అటు ఏం వెళ్తాంలే

- మరో మూడు నెలల పాటు ట్రాఫిక్ సిగ్నల్స్ రానట్లే..?
- ట్రాఫిక్, కార్పొరేషన్ అధికారుల సమన్వయయ లోపం
- పనిచేయకపోవటంతో నిరంతరం ట్రాఫిక్ సమస్యలు
- ముఖ్యమైన పాయింట్‌లలో కూడా కనిపించని సిబ్బంది

పట్నంబజారు: 'ఆ... అటు ఏం వెళ్తాంలే..' ఇదీ తరుచూ నగరవాసుల నిటూర్పు.. నగరమంటేనే బిజీబిజీ జీవితాలు.. ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు.. స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు, పనులకు వెళ్లే కార్మికులు ఇలా.. ఇక జిల్లా కేంద్రానికి వివిధ పనులపై వచ్చే ప్రజలు ప్రతిరోజు వేల సంఖ్యలో ఉంటారు. నగర జనాభాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ నిర్వహించాల్సి ఉంది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో కీలకంగా ఉండే సిగ్నల్స్ వ్యవస్థపైనా శ్రద్ధ లేకుండా పోయింది. దీంతో నగరం ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుంటోంది.

రద్దీ కూడళ్లు ఇలా...

నగరంలో ప్రధాన ప్రాంతాలమైన పాత బస్టాండ్ సెంటర్, హిమని కూల్‌డ్రింక్స్, హిందూ కళాశాల కూడలి, బృందావన్ గార్డెన్స్, మదర్‌థెరిస్సా, ఎత్తు రోడ్డు సెంటర్, కళామందిర్ సెంటర్‌తో పాటు మరికొన్ని ముఖ్యమైన ప్రాంతాలు కలుపుకుని ఇప్పటికే 12 సిగ్నల్స్ ఉన్నాయి. ప్రస్తుతానికి ఏ ఒక్కటి పని చేయని పరిస్థితి ఏర్పడింది. దీనితో ట్రాఫిక్ సమస్యకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. చుట్టుగుంట వంటి అత్యంత ప్రధానమైన రహదారిలో కూడా సిగ్నల్స్ లేకపోవటంతో, అదే రూటులో వచ్చే సమయంలో ఎత్తు రోడ్డు వద్ద ప్రత్తిపాడు, ఏటుకూరు ప్రాంతాల నుంచి వాహనాలు వస్తున్న సమయంలో తీవ్ర అంతాయం కలుగుతోంది. చుట్టుగుంట మీదుగా నరసరావుపేట, సత్తెనపల్లి, మాచర్ల, వినుకొండ, చిలకలూరిపేట, హైదరాబాద్‌తో పాటు అనేక ప్రాంతాల నుంచి బస్సులు, ఇతర వాహనాలు భారీగా వస్తుంటాయి. కనీసం ఏడాది పైగా ఈ పరిస్థితి ఏర్పడినా.. అధికారుల్లో కనీస చలనం లేకపోవటం దారుణం. దీనికి తోడు ట్రాఫిక్ సిబ్బంది చేతికి చేస్తున్న హ్యాండిల్ కంట్రోలర్స్ కూడా పని రాకుండా పోయాయి.

సిగ్నల్స్ కనిపిస్తే ఒట్టు!



రాధాకృష్ణా థియేటర్ సెంటర్‌లో పరిస్థితి



ట్రాఫిక్‌లో చిక్కుకున్న 108 అంబులెన్స్

26గాను 12 ఏర్పాటు....

నగరంలో ఉన్న కొత్త సిగ్నల్స్‌కే దిక్కుమొక్కు లేకపోతే.. నూతన సిగ్నల్స్‌ను ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నామని చెప్పటం విడ్డూరంగా ఉంది. కనీసం ఇప్పటి వరకు ట్రాఫిక్, కార్పొరేషన్ అధికారులు సంయుక్తంగా కలసి సిగ్నల్స్ అంశంలో ఒక స్పష్టమైన నిర్ణయానికి వచ్చిన పాపాన పోలేదు. అధికారుల సమన్వయ లోపంతోనే సిగ్నల్స్ సమస్య కొరకరాని కొయ్యగా మారిపోయింది. గతంలో నగరంలోని పలు ప్రాంతాల్లో సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని అధికారులు ఆలోచన చేశారు. ఇప్పటికే 12 ప్రాంతాల్లో సిగ్నల్స్ ఉన్న క్రమంలో మరో 14 చోట్ల కలిపి మొత్తం 26 సిగ్నల్స్ ఉండేందుకు దృష్టి సారించారు. అయితే ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. పలు చోట్లు సిగ్నల్స్ ఏర్పాటు చేశారే తప్ప, అవి పని చేస్తున్న దాఖలాలు లేవు.

కార్పొరేషన్ అధికారులతో చర్చిస్తున్నాం

నగరంలో సిగ్నల్స్ అంశానికి సంబంధించి కార్పొరేషన్ అధికారులతో పలుమార్లు చర్చించాం. అయితే స్పష్టంగా కొద్ది రోజుల వ్యవధి లోనే సిగ్నల్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. సిగ్నల్స్ లేకపోవటం వలన ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. త్వరితగతిన పునరుద్ధరించేందుకు కృషి చేస్తాం.

– రమేష్, ట్రాఫిక్ డీఎస్పీ

బస్టాండ్ వద్ద అధ్వానంగా..

ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వద్ద మరి ఘోరంగా ట్రాఫిక్ సిబ్బంది చేత మైకులు పెట్టించి, రోడ్లపై వాహనాలు నిలబెట్టకూడదంటూ.. అనౌన్స్‌మెంట్‌లు చేయించే దుస్థితిలో ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు. కార్పొరేషన్ అధికారుల పూర్తిస్థాయి నిర్లక్ష్యం కారణంగానే సిగ్నల్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ట్రాఫిక్ సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికే పలుమార్లు లిఖిత పూర్వకంగా పోలీసు ఉన్నతాధికారుల నుంచి ట్రాఫిక్ అధికారుల వరకు సమస్యను విన్నవించినప్పటికీ ప్రతిఫలం లేదనే చెప్పాలి.

సిబ్బంది ఎక్కడ సారూ...?

ఆర్టీసీ బస్టాండ్ మొదలుకుని బ్రహ్మానందరెడ్డి స్టేడియం, పాతబస్టాండ్ సెంటర్, హిమని కూల్‌డ్రింక్ సెంటర్, మార్కెట్, హిందూ కళాశాల కూడలి మీదుగా ప్రయాణం అంటేనే.. ఆ అటు ఏం వెళ్తాంలే.. అని పరిస్థితి ఏర్పడింది. పూర్తిస్థాయిలో అంబులెన్స్‌లు ఇరుక్కుపోతున్నా.. సైరెన్ సౌండ్ మార్మోగుతున్నా.. కనీసం ట్రాఫిక్ సిబ్బంది పట్టించుకోకపోవటం సిగ్గుచేటు. ప్రధాన పాయింట్‌లలో ట్రాఫిక్ సిబ్బంది కనీసం కనపడకపోవటం నిత్యకృత్యమే. దీనికి తగ్గట్లు పాయింట్‌లకు దగ్గర్లో కూర్చుని సిబ్బంది అంతా ఒక చోట చేరి ముచ్చట్లు చెప్పుకుంటున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీనిపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సిగ్నల్స్ పనిచేసేలా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

శాంతిభద్రతల సమస్యలు పరిష్కరించండి

- జిల్లా ఎస్పీ సతీష్ కుమార్
- పట్టాభిపురం పోలీస్ స్టేషన్ తనిఖీ



లక్ష్మీపురం: పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. తొలుత పోలీసు స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఫిర్యాదిదారులకు వెయిటింగ్ రూమ్ ఉండాలని, పెండింగ్‌లో ఉన్న వాహనాలను త్వరగా డిస్పోస్ చేయాలని సూచించారు. వివిధ కేసుల్లో నిందితులు అరెస్ట్ కాని కేసులలో నిందితులను ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అరెస్ట్ చేయాలని ఆదేశించారు. పోలీసు స్టేషన్ పరిధిలో స్కూల్స్, కాలేజీ, హాస్టల్స్ వద్ద నిఘా ఏర్పాటు చేయాలని, ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని, సమర్థమై నేర నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పగలు – రాత్రి పోలీస్ గస్తీ ఏర్పాటు చేయాలని అప్పుడు నేరాలు తగ్గుతాయని తెలిపారు. రౌడీ షీటర్ల కదలికలు వారి కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శుల(మహిళా పోలీస్) సహకారంతో ఆయా వార్డుల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారం తీసుకొని, వారికి తగిన కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఎప్పటి కప్పుడు నేర సమీక్ష చేస్తుండాలని కోరారు. రౌడీముకలపై నిఘా ఉంచాలని కోరారు. ఆయన వెంట గుంటూరు పశ్చిమ సబ్ డివిజన్ డీఎస్పీ జయరాం ప్రసాద్, పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు, స్టేషన్ ఎస్ఐలు రాంబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోటోఫెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: రోటరీక్లబ్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాల ప్రిన్సిపాల్ కేవీ సెబాస్టియన్ తెలిపారు. మంగళవారం శ్యామలానగర్‌లోని మాంటిస్సోరి స్కూల్లో క్రీడాపోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా సెబాస్టియన్ మాట్లాడుతూ గత నెల 27 నుంచి ఈనెల 3వ తేదీ వరకు జరిగిన రోటోఫెస్ట్-2024లో భాగంగా కేరమ్స్, వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతితో పాటు వాలీబాల్, ఫ్యాన్సీ డ్రెస్‌లో ద్వితీయ స్థానం, షటిల్ బ్యాడ్మింటన్‌లో తృతీయ స్థానంలో నిలిచి, బహుమతులు సాధించారని వివరించారు. చదువుతో పాటు విద్యార్థులను క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మంజు సెబాస్టియన్ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మంగళవారం రాత్రి నటరాజ సంగీత నృత్య కళాశాల 19వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. నాట్యాచారిణి ఎ.విజయకుమారి అధ్యక్షత వహించగా, ఆలయ పాలక మండలి అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వర రావు, సహకార్యదర్శి వూటుకూరి నాగేశ్వర రావు, నాట్యా చార్యులు డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. చిన్నారులు మహాగణపతిమ్, అనుక్షణం శివనామమే, తిల్లాన, శివపంచాక్షరీ స్తోత్రం, నటరాజ స్తోత్రం, కట్టెదుర వైకుంఠం, ఇదిగో భద్రాద్రి, బ్రహ్మమొక్కటే, వినాయక కౌత్వం, ఆధ్యాత్మిక రామాయణ కీర్తన అనే కూచిపూడి నత్యాలు, కొయిలార్ అనే జానపద నత్యాలు ప్రదర్శించారు. వారి నృత్యాలు సభికులను, కళాభిమానులను అలరించాయి. కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో అనంతుల ప్రణయనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

సమయపాలనే విజయానికి తొలిమెట్టు



మాట్లాడుతున్న వేణుగోపాల్

గుంటూరు ఎడ్యుకేషన్: సమయపాలనే విజయానికి తొలిమెట్టు అని ప్రముఖ మనస్తత్వశాస్త్ర నిపుణుడు డాక్టర్ తిరివీధి వేణుగోపాల్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో మంగళవారం డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థులకు అభివ్యక్తి నైపుణ్యాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ జీవితంలో విజయవంతంగా రాణించాలంటే సమయపాలన తప్పనిసరిగా ఉండాలని సూచించారు. సాంకేతికతను తమ అభివృద్ధికి ఉపయోగించుకుని, ప్రణాళిక, ఒత్తిడిలో ఉన్నప్పుడు సమస్యను పరిష్కరించే నైపుణ్యం, స్థిరమైన లక్ష్యం, తల్లిదండ్రులు, గురువులపై క్రియాశీలత అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితా దేవి, వాసవీ జాగృతి క్లబ్ అధ్యక్షులు ఎ.సూర్య రాఘవేంద్రరావు, చార్టర్ కన్వీనర్ ఏఎస్ రంగ రత్నశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, డాక్టర్ జీవీ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

11న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా



లక్ష్మీపురం: భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 11వ తేదీ కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యానారాయణ పిలుపునిచ్చారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ధర్నా కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఏఐటీయూసీ కార్యదర్శి మేడా హనుమంతరావు అధ్యక్షత వహించారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక అందడం లేదని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎన్నికల సందర్భంగా చెప్పిన మాట ప్రకారం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకోవాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కోట మాల్యాద్రి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, శివ పాల్గొన్నారు.

విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

గుంటూరు కార్పొరేషన్ కమిషనర్ శ్రీనివాసులు



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న గుంటూరు నగర కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ పి.శ్రీనివాసులు హెచ్చరించారు. రోజువారీ పర్యటనలో భాగంగా నగర శివారు విలీన గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై కేటాయించిన విధుల్లో నిర్లక్ష్య వైఖరి కనబరచిన ఏఈ నాగవేణిని విధుల నుంచి సస్పెండ్ చేసి ఈఎన్సీకి సిఫార్స్ చేయాలని ఎస్ఈకి సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యవైఖరి ప్రదర్శిస్తున్నారని స్థానికుల ఫిర్యాదు మేరకు బొంతపాడు (194 వార్డు సచివాలయం) శానిటేషన్ కార్యదర్శి బి.బోడెయ్యను విధుల నుంచి సస్పెండ్ చేయాలని సీఎంఓహెచ్‌ని ఆదేశించారు. కేవీపీ కాలనీ, అంకిరెడ్డిపాలెం, చౌడవరం, బుడంపాడు, బొంతపాడు ప్రాంతాల్లో అంగన్‌వాడీ సెంటర్లలో మౌలిక వసతుల ఏర్పాటు, సంజీవయ్య నగర్ గేటు దగ్గర తాగునీటి ప్రధాన పైప్ లైన్ ఇంటర్ కనెక్షన్, లీకులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ కేవీపీ కాలనీ కేఎస్ఆర్టీ హైస్కూల్లోని అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్లు, నీటి సౌకర్య కల్పనపై నిర్లక్ష్య వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత ఏఈ నాగవేణిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఈఎన్సీకి సిఫార్స్ చేయాలని ఎస్ఈని ఆదేశించారు. అంకిరెడ్డిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్ల నిర్మాణం వెంటనే ప్రారంభించాలని, కేంద్రం పక్కనే స్థానికులకు అనువుగా లైబ్రరీ నిర్మాణానికి, ఎస్సీ కాలనీ శ్మశానానికి ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈని ఆదేశించారు. అలాగే చౌడవరం, బుడంపాడు, బొంతపాడు ప్రాంతాల్లోని కేంద్రాల్లో కూడా పనులను ఈ నెల 15 నాటికి పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. బొంతపాడు 194 వార్డు సచివాలయం పరిధిలో శానిటేషన్ కార్యదర్శి బోడెయ్య ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉంటున్నారని, స్థానికుల ఫిర్యాదు మేరకు విధుల నుంచి సస్పెండ్ చేయాలని సీఎంఓహెచ్‌ని ఆదేశించారు. శివనాగరాజు కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి, ప్రతి రోజు వస్తున్న అవుట్ పేషెంట్ వివరాలను రిజిస్టర్‌లో తనిఖీ చేసి, స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. పర్యటనలో ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈలు సతీష్, కళ్యాణరావు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ హౌసింగ్ లే అవుట్స్‌లో ఇళ్ల నిర్మాణ పనుల కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్లు పనులు వేగవంతం చేసి, డిసెంబర్‌లోగా తమ నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గుంటూరు నగరపాలక సంస్థ లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించిన పేరేచర్ల లే అవుట్‌లో హౌసింగ్ పీడీ, ఇంజినీరింగ్, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఎమినిటి కార్యదర్శులు, కాంట్రాక్టర్లతో లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ప్రసాద్, ఈఈ శంకరరావు, నగరపాలక సంస్థ ఈఈ సుందరరామిరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి



పాలు పోస్తున్న భక్తులు



ఆంజనేయపేట నాగుల పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

నగరంలోని పలు శివాలయాలలో నాగుల చవితి అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు వేకువ జాము 4 గంటల నుంచి నాగేశ్వరస్వామికి పాలు పోసి, విశేష పూజలు చేశారు. పట్టాభిపురంలోని సత్య నారాయణస్వామి ఆలయప్రాంగణం, బ్రాడీపేట ఒకటో వీధిలోని శ్రీఆంజనేయస్వామి ఆలయం లో, అరండల్‌పేట శివాలయంలో, శ్రీఅష్టలక్ష్మీ మందిరాలలో విశేషంగా భక్తులు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పూజలు నిర్వహించారు. మారుతీనగర్‌లోని శ్రీకంచి కామ కోటి పీఠ శ్రీమారుతీదేవాలయ ప్రాంగణంలో స్వామి వారికి ఏకాదశి రుద్రాభిషేకాలు ప్రదోషకాలంలో సహస్రమృత్తిక లింగార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, గుంటూరు





స్వర్ణభారత్ నగర్ నాగుల పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



ఎస్పీ బంగ్లా ఎదుట నాగుల పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

నేటితో ముగినున్న ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియ

నెహ్రూ నగర్: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటు దరఖాస్తు చేయడానికి గడువు బుధవారంతో ముగుస్తుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 1, 2021 నాటికి ముందు పట్టభద్రులైన వారు ఆన్‌లైన్‌లో, గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటర్‌గా అర్హత కలిగిన వారు తమ ఓటు కోసం దరఖాస్తు చేయడానికి ఎన్నికల సంఘం షెడ్యూల్ మేరకు బుధవారం వరకే అవకాశం ఉందన్నారు.

ఉద్యోగుల సమస్యలపై సూపరింటెండెంట్‌కు వినతి



డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణను అభినందిస్తున్న యూనియన్ నేతలు

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నేతలు మంగళవారం గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నూతనంగా విధుల్లో చేరిన డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణను కలసి సమస్యలను విన్నవించారు. ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన మెడికల్ రీయింబర్స్ మెంట్ బిల్లులు త్వరగా క్లియర్ చేయాలని కోరారు. ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీం ద్వారా ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి ప్రత్యేక వైద్య చికిత్స అందేలా చూడాలన్నారు. ఎంప్లాయ్ హెల్త్ స్కీంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్యోగల సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకుంటానని డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ హామీ ఇచ్చారు. ఉద్యోగులకు చికిత్సలు అందుబాటులో తీసుకురావడానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. సూపరింటెండెంట్‌ను కలసిన వారిలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరీముల్లా షాఖాదరి, జిల్లా ఉపాధ్యక్షుడు రహిమాన్, నగర శాఖ అధ్యక్షుడు నాగేశ్వరరావు, నగర ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, నాగరాజు, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, జాన్, పెద కోటయ్య, మహిళా విభాగం నాయకురాలు నీలిమా, షబానా సుల్తానా, అరుణకుమారి, రోజా పాల్గొన్నారు.


నర్సింగ్ స్కూల్ సమస్యలపై వినతి

గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నూతనంగా విధుల్లో చేరిన డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణను మంగళవారం ఆస్పత్రి ఆవరణలోని ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. అనంతరం నర్సింగ్ స్కూలులో ఉన్న సమస్యల గురించి ఆయనకు వినతి పత్రం అందజేశారు. పాఠశాలకు భవనం లేకపోవటం వల్ల ఇబ్బంది పడుతున్నామని, విద్యార్థులకు చైర్స్ సరిపడా లేవని, పాఠశాలలోని ఫ్లోరింగ్ పాడైపోయిందని, వార్డెన్ పోస్ట్ ఖాళీగా ఉండటం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని వివరించారు. నర్సింగ్ స్కూల్ సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని సూపరింటెండెంట్ హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో స్కూల్ ప్రిన్సిపాల్ సుజాత, నర్సుల సంఘం సెక్రటరీ వెల్లంపల్లి పద్మజ ఉన్నారు.

అమెరికా వైపు చూస్తున్న 'ప్రపంచం'

లక్ష్మీపురం: అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల కోసం ప్రపంచం ఉత్కంఠగా ఎదురు చూస్తోందని విద్యావేత్త ఆర్‌వీ సింగరయ్య అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో అమెరికా అధ్యక్ష ఎన్నికలు– తీరు తెన్నులు అంశంపై మంగళవారం చర్చ నిర్వహించింది. సమావేశానికి సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. అధ్యక్ష పాలన అమలులో ఉన్న అమెరికా జాతీయ స్థాయిలో అధ్యక్షుడు రాష్ట్ర స్థాయిలో గవర్నర్ నిజమైన అధికారాలు కలిగి ఉంటున్నారని తెలిపారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విశ్రాంతఇంజినీర్ ఎస్.సదాశివం మాట్లాడారు. సంస్థ సీనియర్ సభ్యులు బి.జనార్ధనరావు, మురళి ప్రసంగించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు నూతక్కి విద్యార్థులు



నూతక్కి(మంగళగిరి): రాష్ట్ర స్థాయిలో జరిగే వాలీబాల్ పోటీలకు నూతక్కి జిల్లా పరిషత్ స్కూలు విద్యార్థులు ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాల పిడి కె.రజనీ నాయక్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 2వ తేదీన జరిగిన అండర్ -14 బాలుర, బాలికల గుంటూరు జిల్లా వాలీబాల్ జట్టుకు ముగ్గురు బాలికలు నూతక్కి నందు, నూతక్కి అనూహ్య, చాడవరపు నందుషాలు, ఇద్దరు బాలురు రావూరి కోటిసూర్య, బూరుగడ్డ జగన్‌లు ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయినట్లు తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు విజయనగరం జిల్లా భోగాపురం గ్రామంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

వారంలో రెండు రోజులు వ్యాక్సినేషన్

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శ్రావణ్‌బాబు



ప్రత్తిపాడు: ప్రతి వారం బుధ, శనివారాల్లో తప్పనిసరిగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఏ శ్రావణ్‌బాబు అన్నారు. మండల పరిధిలోని పెదగొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌బాబు మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారుల ఎత్తు, బరువుల ఆధారంగా గ్రోత్ చార్ట్ సిద్ధం చేసుకోవాలి, పెరుగుదల పట్టికలో ఏమైనా రెండ్ అలర్ట్ ఉంటే వెంటనే వైద్యాధికారులకు తెలియజేయాలని చెప్పారు. గర్భిణులు పుట్టింటికి వెళ్లినప్పటికీ, ప్రసవించే వరకు ఏఎన్ఎంలు ఫాలోఅప్ చేయాలని కోరారు. అదే విధంగా బిజిటీ టీకాను వేగవంతం చేయాలని కోరారు. సచివాలయ ఏఎన్ఎంలకు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు వరకు సమయాన్ని మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. పురుషులు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు చేయించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ మేరి యునిస్, హేమంత్, ఎంపీహెచ్ఈఓ చెల్లమ్మ, పీహెచ్ఎన్ నిర్మల పాల్గొన్నారు.